సాక్షి
కాకినాడ
గురువారం । 16 । మార్చి । 2023



పీజీలో నీట్‌గా ర్యాంకులు
నీట్ పీజీ ఎంట్రన్స్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు ర్యాంకులు సాధించారు. దీంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. 8లో



బ్యాటరీ బైక్‌ల షోరూంలో అగ్నిప్రమాదం
కాకినాడలోని ఓ బ్యాటరీ బైక్‌ల షోరూంలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. పది వాహనాలు కాలి బూడిదయ్యాయి. 8లో

డెల్టాలకు 7,030 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 7,030 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,450 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.25 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

సెట్రాజ్ సీఈఓగా షేక్ ఇమ్రాన్



కాకినాడ రూరల్: సెట్రాజ్ సీఈఓగా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి షేక్ ఇమ్రాన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ సెట్రాజ్ సీఈఓగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సునీత పనిచేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సెట్రాజ్ సీఈఓగా పూర్తి అదనపు బాధ్యతలను ఇమ్రాన్ స్వీకరించారు. జిల్లాలో యువజన సర్వీసుల శాఖతో పాటు క్రీడలను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు.

కాకినాడ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ పదవీ కాలం పొడిగింపు



కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ: జిల్లా కేంద్రమైన కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ కృతికా శుక్లా పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ మేరకు పుర పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి పేరుతో బుధవారం సాయంత్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. కాకినాడ నగర పాలక సంస్థ పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి కాలపరిమితి బుధవారంతో ముగిసిన నేపథ్యంలో తాజా ఉత్తర్వులు విడుదల చేశారు. ఇవి గురువారం నుంచి అమలులోకి రానున్నాయి.

రద్దీగా రత్నగిరి




సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి బుధవారం కిటకిటలాడింది. సుమారు 25 వేల మంది సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. రెండు వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 4 వేల మంది భక్తులకు నిత్యాన్నదాన పథకంలో భోజనం పెట్టారు.

చినవెంకన్న హుండీ ఆదాయం రూ.1.84 కోట్లు

ద్వారకా తిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. గడచిన 22 రోజులకు గాను నగదు రూపేణా చినవెంకన్న స్వామికి రూ.1,83,76,847 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 266 గ్రాముల బంగారం, 5.518 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయని వివరించారు. రద్దయిన పాత రూ.1,000, రూ.500 నోట్ల రూపంలో రూ.54,500 లభించాయని చెప్పారు.

సహకార చట్టాలకు లోబడి సొసైటీల నిర్వహణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి నాగభూషణం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సహకార చట్టం, నిబంధనలకు అనుగుణంగా ప్రాథమిక సహకార సంఘాల సీఈఓలు సొసైటీలను నిర్వహించాలని జిల్లా సహకార అధికారి మిరియాల నాగభూషణం ఆదేశించారు. స్థానిక గాంధీపురంలోని రామదాసు సహకార శిక్షణ కేంద్రంలో ఏపీ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యాన పీఏసీఎస్ సీఈఓలకు సహకార చట్టంలో నూతన సవరణలు, సొసైటీల బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై ఆయన అధ్యక్షతన బుధవారం ఒక రోజు శిక్షణ జరిగింది. నాగభూషణం మాట్లాడుతూ, సకాలంలో ఆడిట్ జరిపించి, పారదర్శకంగా పని చేసి సభ్యుల మన్ననలు పొందాలని అన్నారు. సహకార చట్టం బలమైనదని, దీనిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డిప్యూటీ రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ బి.శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన సవరణలను వివరించారు. సీఈవోల బాధ్యతలు, వ్యాపారాభివృద్ధి తదితర అంశాలను, చట్టంలోని ముఖ్యాంశాలను రామదాసు ట్రైనింగ్ సెంటర్ లెక్చరర్, ట్రైనింగ్ ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు వివరించారు.

మెడికల్ టెస్ట్.. ఇక బెస్ట్



యూరిన్ అనలైజర్ (దీని ద్వారా 9 రకాల పరీక్షలు)



ఎలక్ట్రో అనలైజర్ (పొటాషియం, సోడియం పరీక్షలకు)



బయో కెమిస్ట్రీ అనలైజర్ (23 రకాల పరీక్షలకు)



కంప్లీట్ బ్లడ్ కౌంట్ మెషీన్ (24 రకాల రక్త పరీక్షలకు)

- 23 యూపీహెచ్‌సీల్లో ఆధునిక పరికరాలు
- ఒక్కో పీహెచ్‌సీలో రూ.20 లక్షలతో ఏర్పాటు
- అక్కడే ఉచితంగా వైద్య పరీక్షలు

పిఠాపురం: అనారోగ్యం బారిన పడి, ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే వందలు వేల రూపాయలు మంచినీళ్లలా ఖర్చయిపోతున్న పరిస్థితి. సాధారణ షుగర్ పరీక్ష చేయించుకోవాలంటేనే ప్రైవేటు ల్యాబుల్లో సుమారు రూ.100 అవుతోంది. ఇతర రక్త పరీక్షలకు భారీగానే చేతిచమురు వదిలిపోతోంది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చిన్నచిన్న వైద్య పరీక్షలు తప్ప పెద్దవి, ఖరీదైనవి చేసేవారు కాదు. దీంతో పేదలు ఉచితంగా వైద్యం చేయించుకున్నా వైద్య పరీక్షలకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయడంతో పాటు తీవ్ర వ్యయప్రయాసలకు గురి కావాల్సి వచ్చేది. ఇకపై అటువంటి బాధ అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీ) సౌకర్యాలు కల్పించింది. రూ.కోట్లు వెచ్చించి పేదల వైద్య పరీక్షలకు అవసరమయ్యే పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో ఖరీదైన వైద్య పరీక్షలు పేదలకు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి.

అన్ని వేళలా అందుబాటులో వైద్యులు

జిల్లా వ్యాప్తంగా 23 యూపీహెచ్‌సీల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి యూపీహెచ్‌సీకి వైద్యులను నియమించడంతో పాటు రాత్రి సమయాల్లో ఫోన్ చేస్తే చాలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైద్య సేవలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలూ అక్కడే నిర్వహిస్తున్నారు. ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. ప్రాథమిక వైద్యానికి సంబంధించిన అన్ని రకాల మందులూ అందుబాటులో ఉంటాయి. ఇకపై ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ అసాంక్రమిక వ్యాధులకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి వ్యాధులకు ప్రత్యేక విభాగాలు పని చేస్తాయి. వారికి మందులు ఉచితంగా అందిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి పెద్దాసుపత్రులకు పంపించే ఏర్పాట్లు చేస్తారు.



పైసా ఖర్చు లేకుండా..

ఇక్కడకు వచ్చే రోగులకు ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా అన్ని రకాల అత్యాధునిక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలం, పిఠాపురం, శంఖవరం మండలాల్లోని కొన్ని గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్నాం. ప్రైవేటు ల్యాబ్‌ల్లో రూ.వేలు ఖర్చయ్యే వైద్య పరీక్షలు ఇక్కడ ఉచితంగా చేస్తున్నాం. ప్రజలందరూ వీటిని వినియోగించుకోవాలి.

– కె.శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్, యూపీహెచ్‌సీ, గొల్లప్రోలు

జిల్లాలో యూపీహెచ్‌సీలు : 23
వైద్య సేవలు పొందే రోగులు : రోజుకు సుమారు 3,000
అందుబాటులోకి వచ్చిన వైద్య పరీక్షలు : 63 రకాలు
ప్రతి రోజూ చేస్తున్న టెస్టులు : 1,000
టెస్టులు చేయించుకుంటున్న రోగులు : రోజుకు 900

63 రకాల వైద్య పరీక్షలు



యూపీహెచ్‌సీల్లో 63 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. యూరిన్ అనలైజర్, ఎలక్ట్రో అనలైజర్, బయోకెమిస్ట్రీ అనలైజర్, కంప్లీట్ బ్లడ్ కౌంట్ మెషీన్ తదితర అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేశారు. అన్ని రకాల వైద్య పరీక్షలకూ ల్యాబ్ టెక్నీషియన్లను నియమించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, హెచ్‌ఐవీ, యూరిన్, సోడియం, పొటాషియం పరీక్షలు, 24 రకాల రక్త పరీక్షలు చేసే విధంగా రూ.20 లక్షల విలువైన పరికరాలను సమకూర్చారు.

– బి.షారోన్ కీర్తన, ప్రభుత్వ వైద్యురాలు, యూపీహెచ్‌సీ, గొల్లప్రోలు

వ్యయప్రయాసలు తగ్గాయి

గతంలో ఏ చిన్న టెస్టు చేయించుకోవాలన్నా పిఠాపురం, కాకినాడ వెళ్లాల్సి వచ్చేది. నాకు షుగర్ వ్యాధి ఉన్నందున ప్రతి నెలా టెస్టులు చేయించుకోవాల్సి ఉంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాడిని. ప్రస్తుతం యూపీహెచ్‌సీలో అన్ని రకాల వైద్య పరీక్షలూ అందుబాటులోకి రావడంతో వ్యయప్రయాలు తగ్గాయి. అనారోగ్యంతో పక్క ఊరు వెళ్లడం అంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఆ బాధ లేకుండా మా ఊళ్లోనే వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాను.

– కె.కామరాజు, గొల్లప్రోలు

సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షిద్దాం..

- కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి
- తుని మండలంలో పర్యటన



తపోవనం ఆశ్రమంలో అనుగ్రహ భాషణం చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి

తుని రూరల్: సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి అన్నారు. తుని మండలం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో రాజరాజేశ్వరీ అమ్మవారిని, ఆంజనేయస్వామిని ఆయన బుధవారం దర్శించుకున్నారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. తొలుత తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి ఆధ్వర్యాన వేద పండితులు, వేద విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. శంకర విజయేంద్ర సరస్వతికి సచ్చిదానంద సరస్వతి పాదపూజ నిర్వహించారు. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, తునిలో శివాలయాన్ని కూడా కంచి పీఠాధిపతి దర్శించి, పూజలు చేశారు. ఎస్.అన్నవరంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, నగల వ్యాపారి దాడిశెట్టి విష్ణుచక్రం ఇళ్లకు వెళ్లారు. మంత్రి రాజా తల్లిదండ్రులు దాడిశెట్టి సత్యనారాయణమ్మ, శంకరరావు, భార్య లక్ష్మీచైతన్య, కుటుంబ సభ్యులు స్వామివారికి పూజలు చేసి, ఆశీస్సులు పొందారు. తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, భక్తులు మహాస్వామిని దర్శించుకున్నారు.

ప్రశాంతంగా ప్రారంభం



కాకినాడలో పరీక్ష కేంద్రం బయట విద్యార్థులు,తల్లిదండ్రులు

- మొదలైన ఇంటర్ పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో తొలి రోజు 48,793 మంది హాజరు
- 140 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- 2 వేలకు పైగా కెమెరాలతో నిఘా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 140 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. తొలి రోజు మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో తెలుగు, సంస్కృతం; వృత్తి విద్యలో జనరల్ ఫౌండేషన్ కోర్సు (జీఎఫ్‌సీ) పరీక్షలు జరిగాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదు. తొలి రోజు 66 పరీక్ష కేంద్రాలను స్క్వాడ్స్ తనిఖీలు చేశాయి. 13 కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షించాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. అన్ని కేంద్రాల్లోనూ ఉదయం సరిగ్గా తొమ్మిది గంటలయ్యేసరికి గేట్లు మూసేశారు. పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు చెప్పినా, కొందరు విద్యార్థులు గేటు వేసిన తర్వాత ఆలస్యంగా రావడం కనిపించింది. కొందరైతే హడావిడిలో హాల్ టిక్కెట్లు తెచ్చుకోవడం మర్చిపోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కాకినాడతో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అవస్థలకు గురయ్యారు. జోన్–1, 2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద సుడిగాలి పర్యటన చేసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా జిల్లాల్లోని ఆర్ఐఓలు, డీవైఈఓలు కూడా పరీక్షల తీరును పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో 2 వేలకు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



సమయం మించి పోవటంతో పరుగు తీస్తున్న విద్యార్థి

జిల్లాల వారీగా హాజరు వివరాలు

విభాగం	మొత్తం రాయాల్సిన వారు	హాజరు	గైర్హాజరు
తూర్పు గోదావరి జిల్లా			
జనరల్	11,728	11,517	211
ఒకేషనల్	1,087	969	118
మొత్తం	12,815	12,486	329
కాకినాడ జిల్లా			
జనరల్	19,377	18,714	663
ఒకేషనల్	1,475	1,378	97
మొత్తం	20,852	20,092	760
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా			
జనరల్	11,377	10,965	412
ఒకేషనల్	2,542	2,244	298
మొత్తం	13,919	13,209	710
అల్లూరి సీతారామరాజు జిల్లా			
జనరల్	2,525	2,349	176
ఒకేషనల్	118	91	27
మొత్తం	2,643	2,440	203

రైతులకు బ్యాంకింగ్ సేవలు చేరువ చేయాలి



జిల్లా సలహా కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాల్లో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

- రుణ మంజూరు లక్ష్యాన్ని చేరుకోవాలి
- బ్యాంకర్లకు జేసీ ఇలక్కియ సూచన

కాకినాడ సిటీ: రైతులకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేసేందుకు బిజినెస్ కరస్పాండెంట్లు తప్పనిసరిగా ప్రతి బుధ, గురువారాల్లో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకూ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఆదేశించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి సంబంధించి జిల్లా సలహా కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశాలు కలెక్టరేట్ వివేకానంద హాలులో బుధవారం జరిగాయి. జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశాల్లో జేసీ పాల్గొని, వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బ్యాంకర్లకు మార్గనిర్దేశం చేశారు. రైతులు, కౌలు రైతులతో పాటు పశు సంవర్ధక, మత్స్యరంగాల వారికి అమలవుతున్న వివిధ కార్యక్రమాలకు సంబంధించిన బ్యాంక్ సేవలపై వారికి అవగాహన పెంపొందించాలన్నారు. ఆర్థిక సమ్మిళిత శిబిరాల్లో ముఖ్యంగా పశుసంవర్ధక, మత్స్య, టిడ్కో, విద్య తదితర రుణాలకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 27,505 మంది కౌలు రైతులకు రూ.28.06 కోట్ల రుణాలు మంజూరయ్యాయన్నారు. పశు సంవర్ధక, మత్స్య రంగాల వారికి రుణాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. ఏపీ టిడ్కోకు సంబంధించి 5,064 మందికి రుణాలు మంజూరు చేయాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 3,386 మందికి మంజూరయ్యాయన్నారు. మిగిలిన దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించాలన్నారు. జగనన్న తోడు ఆరో విడతకు సంబంధించిన లబ్ధిదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఉపాధి సృష్టి, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, పీఎం స్వానిధి, నాబార్డు పథకాలు, మెప్మా కార్యకలాపాలపై కూడా చర్చించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ కన్వీనర్ కేఎస్‌వీ చిన్నారావు, ఎల్‌డీఓ పీపీ పూర్ణిమ, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక అధికారులు ఎన్.విజయకుమార్, బీబీ రమణ, డాక్టర్ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం సహించను

- భక్తులకు సౌకర్యాల కల్పనలో ఆదేశాలు పాటించాల్సిందే
- గడువు లోగా పనులు చేయకపోతే చర్యలు
- 'సాక్షి' కథనంలోని అంశాలపై వెంటనే కదలాలి
- సిబ్బందికి ఇన్‌చార్జి ఈఓ ఆదేశం

అన్నవరం: భక్తులకు సౌకర్యాల కల్పనలో సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ హెచ్చరించారు. విజయవాడలోని కమిషనర్ కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం ఆయన దేవస్థానం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో తాను ఇచ్చిన ఆదేశాల అమలుపై ప్రశ్నించారు. సంతృప్తికరంగా సమాధానం చెప్పని కొంతమంది అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థానంలో గతానికి ఇప్పటికి వచ్చిన మార్పుల పరిశీలనకు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అసెంబ్లీ సమావేశాల సెలవు రోజున వచ్చే అవకాశం ఉందని, ఆలోగా సమస్యలన్నీ పరిష్కరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దేవస్థానం వేద పండితులు, ప్రధానార్చకులు, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ప్రధానంగా 'సత్యదేవుని భక్తులపై సూర్యప్రతాపం' శీర్షికన ఈ నెల 13న 'సాక్షి' ప్రచురించిన కథనంలో వెలుగులోకి తెచ్చిన భక్తులకు నీడ, క్యూలో మంచినీటి సరఫరా, బ్యాటరీ కార్ల మరమ్మతులు వచ్చే ఆదివారం లోపు పూర్తి కావాలని ఆదేశించారు.
- ప్రతి ఉద్యోగీ నుదుటన కుంకుమ లేదా గంధం లేదా విబూదితో బొట్టు ధరించి విధులకు హాజరు కావాలి. విష్ణునామం పెట్టుకోవడం ఇష్టం లేనివారు మరే ఇతర నామం లేదా బొట్టు ధరించవచ్చు. భక్తుల తిలక ధారణకు పశ్చిమ, తూర్పు రాజగోపురాలు, క్యూల వద్ద కుంకుమ, విబూది, గంధం విధిగా ఉంచాలి.
- పశ్చిమ, తూర్పు రాజగోపురాలు, క్యూల వద్ద కొత్త కుండల్లో చల్లని మంచినీరు భక్తులకు సరఫరా చేయాలి.
- నిత్యాన్నదానం విభాగం ద్వారా భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేయాలని గతంలో ఇచ్చిన ఆదేశం అమలుపై ఆరా తీశారు. అమలు కాకపోతే వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు.
- సిబ్బంది బయోమెట్రిక్ వేసే చోట అద్దం పెట్టి, కూడా కుంకుమ, గంధం, విబూది ఏర్పాటు చేయాలి.
- దేవస్థానంలో పని చేసేవారికి, కాంట్రాక్టర్లకు చెల్లింపులు ఆలస్యం చేయరాదు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఈఓ అజాద్

- శ్రీ సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాలలో మొక్కలు నాటే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి. అక్కడ మినీ గోశాల ఏర్పాటు చేయాలి.
- స్వామివారి ప్రసాదం తయారు చేసే భూతాది విభాగంలో పడమటి గోడకు కిటికీ ఏర్పాటు చేయాలి. దాని పై భాగంలోని వెంటిలేటర్‌కు ఎగ్జాస్ట్ ఫ్యాన్ బిగించాలి.
- భక్తులు ఎక్కువగా వచ్చే ప్రదేశాల్లో షామియానాలు వేయించాలి. సంప్రదాయబద్ధంగా చలువ పందిర్లు వేసేచోట వెంటనే వాటిని వేయించాలి.
- ఇంజినీరింగ్ విభాగం డీఈలు, ఏఈలు దేవస్థానంలోని సత్రాలన్నీ తిరిగి వివిధ గదుల్లోని సమస్యలు తెలుసుకోవాలి. ఈ నెల 20వ తేదీన జరిగే ట్రస్ట్‌బోర్డు సమావేశం నాటికి నివేదిక, వ్యయం అంచనా సమర్పించాలి.
- శానిటరీ, సెక్యూరిటీ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరవుతున్నారో లేదో ప్రతి రోజూ పరిశీలించి అటెండెన్స్ చెక్ చేయాలి.
- వివిధ విభాగాల్లోని స్క్రాప్‌ను త్వరగా బయటకు తరలించాలి.
- భక్తులు మెచ్చుకునేవిధంగా మార్పులు కనిపించాలి

• తల్లిడిల్లే పరీక్ష!



ఏడాదిన్నర బిడ్డతో కందుకూరి రాజ్యలక్ష్మీ ప్రభుత్వ మహిళా కళాశాలకు పరీక్ష రాసేందుకు వస్తున్న కోటనందూరుకు చెందిన ఎన్.వినీత



తల్లి పరీక్షకు వెళ్లగా చిన్నారిని లాలిస్తున్న అమ్మమ్మ



పరీక్ష రాసి వచ్చిన తర్వాత చిన్నారిని ముద్దాడుతున్న వినీత

ఆ చిన్నారికి టైఫాయిడ్ జ్వరం.. చిన్నారి తల్లికి పరీక్ష రాయడం తప్పనిసరి.. దీంతో తన బిడ్డతోపాటు తల్లిని కూడా పరీక్ష కేంద్రం వద్దకు తీసుకువచ్చింది. అమ్మ పరీక్ష రాసేందుకు వెళ్లడంతో అమ్మమ్మ చిన్నారి లాలనలో మునిగిపోయింది. ఈ ఘటన బుధవారం రాజమహేంద్రవరంలోని కందుకూరు రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. చిన్నారికి జ్వరంగా ఉన్నా.. తన భవిష్యత్తు కోసం పరీక్ష రాసేందుకు కోటనందూరు గ్రామం నుంచి వచ్చింది వినీత.

- ఫొటో : సాక్షి, రాజమహేంద్రవరం

పీజీలో నీట్‌గా ర్యాంకులు

- ప్రతిభ చూపిన ఉమ్మడి జిల్లా కుర్రాళ్లు
- ఆ కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం

గోకవరం/కరప/ఆలమూరు: నీట్ పీజీ ఎంట్రన్స్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు ర్యాంకులు సాధించారు. దీంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

- గోకవరానికి చెందిన డాక్టర్ జంగేటి ధరణి 475వ ర్యాంకు సాధించింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఆమె 800కు గాను 645 మార్కులు సాధించారు. ఎంసెట్‌లో 642వ ర్యాంకు సాధించిన ఆమె కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ధరణి తండ్రి భద్రరావు గోకవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తుండగా తల్లి శుభలక్ష్మి గృహిణి. ఈ సందర్భంగా ఆమెకు తల్లిదండ్రులు స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ ధరణి మాట్లాడుతూ జనరల్ సర్జన్‌గా పేదలకు మంచి వైద్యం అందించడమే తన లక్ష్యమని తెలిపారు.
- కరప గ్రామానికి చెందిన డాక్టర్ నక్కా భారతి నీట్ పీజీలో ఆలిండియా స్థాయిలో 3,026వ ర్యాంక్ సాధించారు. కరపకు చెందిన రైతు నక్కా రాంబాబు కుమార్తె భారతి ఎంబీబీఎస్ చదివారు. పీజీ సీటు కోసం ప్రిపేరవుతుండగా రాంబాబు గత ఏడాది మృతి చెందారు. తర్వాత హైదరాబాద్‌లో లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని నీట్ రాసింది. వైజాగ్ లేదా గుంటూరులో పీజీ సీటు రావచ్చని ఆమె చెప్పారు. డాక్టర్ భారతిని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు అభినందించారు.
- ఆలమూరు మండలం పెదపళ్ల, చింతలూరు గ్రామాలకు చెందిన ఫణిప్రియ, ఉదయ్ కిరణ్ నీట్ పీజీ ఎంట్రన్స్‌లో ర్యాంకులు సాధించారు. మండలంలోని పెదపళ్ల గ్రామంలో సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన గొడవర్తి నాగేశ్వరరావు, అనురాధాదేవి దంపతుల కుమార్తె ఫణిప్రియ 5,498 ర్యాంకు సాధించింది. ఆమె విశాఖపట్నంలోని గాయత్రీ విద్యా పరిషత్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. పీజీ విభాగంలో రేడియాలజీ లేదా జనరల్ మెడిసిన్ చేసే ఆలోచన ఉందని ఫణిప్రియ తెలిపారు.
- అలాగే వ్యవసాయంపై ఆధారపడి పాల వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న సాధారణ కుటుంబీకులు, చింతలూరుకు చెందిన బొబ్బా కృష్ణ, సుజాత దంపతుల కుమారుడు ఉదయ్ కిరణ్ నీట్ పీజీలో 8,000 ర్యాంకు సాధించారు. ఆయన విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఎంఎస్ సర్జన్ చేసి, అత్యాధునిక రీతిలో ప్లాస్టిక్ సర్జరీ సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.



ధరణికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



డాక్టర్ భారతి



గొడవర్తి ఫణిప్రియ



బొబ్బా ఉదయ్ కిరణ్

బ్యాటరీ బైక్‌ల షోరూంలో అగ్నిప్రమాదం

చార్జింగ్ చేస్తుండగా బ్యాటరీ పేలడమే కారణం

కాకినాడ క్రైం: కాకినాడలోని ఓ బ్యాటరీ బైక్‌ల షోరూంలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించి, పది వాహనాలు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక శాఖ అధికారుల కథనం ప్రకారం.. కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన సరళ ఆటోమొబైల్స్ షోరూం ఉంది. ఇందులోని ఓ ద్విచక్ర వాహనానికి చార్జింగ్ పెడుతుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించి మంటలు అంటుకున్నాయి. లిథియం అయాన్ బ్యాటరీ కావడంతో క్షణాల్లో మంటలు షోరూం మొత్తానికి వ్యాపించాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారులు రెండు అగ్నిమాపక శకటాలతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పది ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయని సాలిపేట అగ్నిమాపక అధికారి ఏసు వెల్లడించారు. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కుదుటపడ్డ 'పొగ' బాధిత విద్యార్థుల ఆరోగ్యం

ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన మిగిలిన ముగ్గురు

అమలాపురం టౌన్: ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తకు నిప్పు పెట్టడంతో వచ్చిన దట్టమైన పొగలతో అస్వస్థతకు గురైన బండార్లంక విజడమ్ స్కూలుకు చెందిన 15 మంది విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా కుదుట పడింది. ఘటన జరిగిన సోమవారం ఉదయం 15 మంది బాధిత విద్యార్థులను అత్యవసర వైద్యం కోసం అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించడం, చికిత్స జరిగాక ఆ రోజు రాత్రి 12 మంది బాధిత విద్యార్థులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన పరిణామాలు తెలిసిందే. మిగిలిన ముగ్గురు విద్యార్థులు పొగ వల్ల ఎక్కువ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో మూడు రోజుల పాటు చికిత్స పొందాల్సి వచ్చింది. ఆ ముగ్గురి విద్యార్థుల ఆరోగ్యం కుదుట పడడంతో ఆస్పత్రి నుంచి బుధవారం డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తెలిపారు. తమ పిల్లలు ఆస్పత్రి నుంచి క్షేమంగా ఇళ్లకు చేరుకోవడంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన ముగ్గురు విద్యార్థులతో వైద్యులు

దేశం గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ చేబోలు

పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రశంస

సీటీఆర్ఐ: భారతదేశంలోనే తొలి హిందీ అష్టావధానం చేసిన డాక్టర్ చేబోలు శేషగిరిరావు తెలుగువాడు కావడం చాలా గర్వించదగ్గ విషయమని ఏపీ హిందీ అకాడమీ, తెలుగు అకాడమీ పూర్వ అధ్యక్షుడు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఆదిత డిగ్రీ కళాశాలలో డాక్టర్ చేబోలు శేషగిరిరావు స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్, దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్పీ గంగిరెడ్డికి చేబోలు శేషగిరిరావు స్మారక పురస్కారం ప్రదానం చేశారు. శాలువాతో సత్కరించి, మెమెంటోను బహూకరించారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ అష్టావధాన ప్రక్రియ అనేది తెలుగు భాషకి మాత్రమే పరిమితమైన రోజుల్లో అష్టావధానాన్ని హిందీలో చేసి చూపించిన ఘనుడు చేబోలు శేషగిరిరావుని కొనియాడారు. భాషపై ఎంతో పట్టు ఉంటేనే కాని అష్టావధానం చేయడం చాలా కష్టమని, అటువంటిది ఏకంగా హిందీలో అష్టావధాన ప్రక్రియ చేపట్టడం, అదీ మన తెలుగువాడు కావడం గర్వకారణంగా ఉందన్నారు. నేటి యువత ఇటువంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయనతో కలిసి 30 సంవత్సరాలు దక్షిణభారత హిందీ ప్రచార సభ్యుడిగా ప్రయాణించిన గంగిరెడ్డికి ఈ అవార్డుని అందించిడం సముచితమన్నారు. పురస్కార స్వీకర్త గంగిరెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డుని పొందడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు లెక్చరర్ డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎస్పీ గంగిరెడ్డి పై ప్రశంసా పద్యాలు రాసి సన్మాన పత్రంగా బహూకరించారు. ప్రాణహిత కవి సన్నిధానం నరసింహ శర్మ, పట్టపగలు వెంకటరావు, గన్ని కృష్ణ, బొల్లా ప్రగడ ఉదయభాను, డాక్టర్ చేబోలు నాగ అచ్యుత భీమశంకర్, సన్నిధానం శాస్త్రి పాల్గొన్నారు.



గంగిరెడ్డికి పురస్కారం అందజేస్తున్న యార్లగడ్డ తదితరులు

యోగివేమన వర్సిటీ, సీటీఆర్ఐ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకుంటున్న అధికారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)-కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ), డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లా యోగివేమన యూనివర్సిటీల మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరిందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.మాగంటి శేషుమాధవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యోగివేమన యూనివర్సిటీ ఇంక్యుబేషన్ సెంటర్ సంచాలకులు ఆచార్య చంద్రశేఖర్, ఆర్అండ్‌డీ సంచాలకులు ఆచార్య పి.చంద్రఓబుల్‌రెడ్డి, సీటీఆర్ఐ నుంచి డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ చంద్రశేఖరరావు, డాక్టర్ కస్తూరికృష్ణ, డాక్టర్ కె.సరళ, డాక్టర్ వై.సుబ్బయ్య అవగాహన పత్రాలపై సంతకాలు చేశారు. పొగాకు, పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ పంటలపై పరిశోధన, శిక్షణతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు సహాయ సహకారాలు ఇచ్చే అంశాలపై పరస్పర అవగాహన ఒప్పందం కుదిరిందని డాక్టర్ శేషుమాధవ్ వివరించారు.

హోరాహోరీగా ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నీ

ప్రకాశం నగర్ : రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో హోరాహోరీగా సాగుతోంది. బుధవారం మొదటి రౌండ్ మ్యాచ్‌లో వైజాగ్ క్రికెట్ అకాడమీ, ఎలెవన్ డాక్స్ తలపడగా ఎలెవన్ డాక్స్ గెలిచింది. రెండో రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ క్రికెట్ అకాడమీ, నానీ క్రికెట్ అకాడమీ తలపడగా వైజాగ్ క్రికెట్ అకాడమీ విజయం సాధించింది.

క్రైం కార్నర్..

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య



సత్యనారాయణ మృతదేహం

రావులపాలెం: స్థానిక గౌతమి గోదావరి పాత బ్రిడ్జిపై నుంచి దూకి రామచంద్రపురానికి చెందిన దూళ్ళ లోవ సత్యనారాయణ(35) ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై వెంకటరమణ తెలిపారు. బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. రావులపాలెం నుంచి జొన్నాడ వైపు వెళ్లే పాత బ్రిడ్జి పై నుంచి ఒక వ్యక్తి గోదావరిలోకి దూకినట్టు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక మత్స్యకార యువకులతో కలసి బోటుపై గాలించి, గోదావరిలోకి దూకిని వ్యక్తిని గుర్తించి ఒడ్డుకు చేర్చామని చెప్పారు. హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి క్షతగాత్రుడిని కొత్తపేట ఏరియా ఆస్పతికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని ఎస్ఐ తెలిపారు.

ఐదేళ్ల క్రితం వివాహం.. ఇద్దరు పిల్లలు..

మృతుడు సత్యనారాయణకు ఐదేళ్ల క్రితం వివాహం అయ్యిందని, భార్య లావణ్య, నాలుగేళ్ల పాప, ఐదునెలల బాబు ఉన్నారు. తాపీమేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం భార్య పుట్టింట్లో ఉంది. కొంత కాలంగా సత్యనారాయణ కూడా మావగారి ఇంటి వద్ద పాలకొల్లు సమీపంలోని జొన్నూరులో ఉంటున్నాడు. ఈ నెల 18 తేదీన భార్యాపిల్లలను తీసుకుని రామచంద్రపురం వెళదామని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం ఇల్లు శుభ్రం చేసి వస్తానని చెప్పి బుధవారం ఉదయం జొన్నూరు నుంచి బయలుదేరినట్టు భార్య లావణ్య పోలీసులకు తెలిపింది. సత్యనారాయణ తండ్రి దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

రామచంద్రపురంలో విషాద ఛాయలు

తాపిమేస్త్రిగా జీవనం సాగిస్తున్న సత్యనారాయణ మృతితో రామచంద్రపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కొడుకు మృతి చెందడంతో తండ్రి దుర్గారావు, తల్లి పాప్పారాయి, భార్య లావణ్య గుండెలు అవిసేలా రోదిస్తున్నారు.



భార్య లావణ్య, నాలుగేళ్ల కూతురితో మృతుడు సత్యనారాయణ (ఫైల్)

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు నుంచి జారిపడి మృతి చెందిన వ్యక్తి

తుని: తుని-గుల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్యలో రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం జరిగిన ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారి పడి 30 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎరుపు రంగు ఫుల్ చేతుల నెక్ బనియన్, నైటు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. తెలుపు రంగు కలిగి 5 అడుగుల ఎత్తు, ఉంగరాల జట్టు కలిగి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగం పేరుతో రూ.6 లక్షలకు టోకరా

గోకవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

గోకవరం: ప్రభుత్వ ఉద్యోగం పేరుతో రూ.6 లక్షలకు టోకరా వేసిన ఘటనపై బుధవారం గోకవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. గోకవరానికి చెందిన గోర్త రాజు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ చదివి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఉద్యోగం కోసం గ్రామానికి చెందిన తుపాకుల గణేష్‌ను సంప్రదించారు. గణేష్‌కు తెలిసిన వైజాగ్‌కు చెందిన బుద్దా అవినాష్, బొక్కం హైమావతి ఆంధ్రప్రదేశ్‌లోని సెక్రటేరియట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. ఈ మాటలు నమ్మినరాజుతో పాటు గోకవరానికి చెందిన మరో ఇద్దరు, రాజమహేంద్రవరానికి చెందిన మరో వ్యక్తి కలిపి మొత్తం రూ.6 లక్షలు ఇచ్చారు. కానీ ఉద్యోగం రాకపోవడంతో తాము మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై యువకుడి అత్యాచారం

పెదపూడి: బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పెదపూడి ఎస్ఐ పి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కైకవోలు గ్రామానికి చెందిన ఒక బాలిక స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమె రోజూ సైకిల్‌పై పాఠశాలకు వెళ్లి వస్తుంది. అదే గ్రామానికి చెందిన ఇనకోటి రాజు అనే యువకుడు ఆమె పాఠశాలకు వెళ్లి వచ్చేటప్పుడు మోటార్ బైక్‌పై వెంబడిస్తూ 'నిన్ను ప్రేమిస్తున్నాను, నన్ను పెళ్లి చేసుకో' అని వేధించేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ రాత్రి రాజు ఆ బాలికను ఆమె పెదనాన్న ఇంటి మేడపైకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వేధించినందుకు జైలు

కడియం: భార్యను వేధించినందుకు రెండేళ్ల జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానాను కోర్టు విధించింది. ఈ మేరకు వివరాలను కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ స్థానిక విలేకరులకు బుధవారం తెలిపారు. 29.3.2015న కడియపులంకకు చెందిన కె.సుజాత తన భర్త దుర్గయ్య వేధింపులు తాళలేక కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. గాయాలతో ఉన్న ఆమెను ఆసుపత్రిలో చేర్చగా, చికిత్స అనంతరం కోలుకుంది. అయితే భర్త వేధింపుల వల్లే తానలా చేశానని పోలీసులకు తెలిపింది. అప్పటి ఎస్ఐ టి.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో వేధింపులకు పాల్పడిన భర్త దుర్గయ్యకు ఏడో ఏజీఎం ఎఫ్‌జే జి.రామకృష్ణ పై విధంగా శిక్ష విధించారు. పీపీగా ఓ మహాలక్ష్మి వ్యవహరించారన్నారు. కోర్టు కానిస్టేబుల్ గంగాధర్‌ను ఆయన అభినందించారు.